క్లుప్తంగా

ఓపెన్ ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తులు

కొండమల్లేపల్లి : 2024–25 సంవత్సరానికి గాను పదో తరగతి, ఇంటర్మీడియేట్‌లలో ప్రవేశానికి అడ్మిషన్లు ప్రారంభమైనట్లు పేర్కొన్నారు. శుక్రవారం తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటి నిర్వహిస్తున్న ఓపెన్ స్కూల్ పోస్టర్‌ను కొండమల్లేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రమావత్ నాగేశ్వర్‌రావు ఆవిష్కరించి మాట్లాడారు. దూరవిద్యలో చదువును కొనసాగించడానికి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ నేనావత్ జాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్యదర్శుల సంఘం అధ్యక్షుడిగా రామలింగారెడ్డి



చందంపేట : పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడిగా చందంపేట గ్రామ కార్యదర్శి నర్ర రామలింగారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధానకార్యదర్శిగా రమావత్ కిరణ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు నర్ర రామలింగారెడ్డి మాట్లాడుతూ కార్యదర్శుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

బెంచీల బహూకరణ

గుర్రంపోడు : మండలంలోని నడికూడ జెడ్పీ ఉన్నత పాఠశాలకు గ్రామానికి చెందిన శ్రీవాస శ్రవణ్‌కుమార్ తన తండ్రి సుదర్శన్ జ్ఞాపకార్థం ఐదు డ్యూయల్ డెస్క్ బెంచీలను బహూకరించారు. తాను చదువుకున్న పాఠశాలకు తన వంతు సాయం అందించాలనే తపనతో 20వేల విలువైన డెస్క్ బెంచీలను అందించిన శ్రవణ్‌ను పాఠశాల హెచ్‌ఎం క్షత్రయ్య, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మారెడ్డి వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించి కృతజ్ఞతలు తెలిపారు.

ఎంఈఓకు సన్మానం

పెద్దవూర : ఇన్‌చార్జ్ ఎంఈఓగా బాధ్యతలు చేపట్టిన తరి రాములను శుక్రవారం మండల విద్యావనరుల కేంద్రంలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా పూలమాల వేసి, పుష్పగుచ్ఛం అందించి శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొంపెల్లి భిక్షపతి, రాష్ట్ర బాధ్యులు జటావత్ చందురుడునాయక్, బాలునాయక్, బాకీ యాదయ్య, జార్జీ, జీహెచ్‌ఎం శ్రీనివాస్, మేదరి దేవేందర్, రాములు, శంకర్, సీఆర్‌పీ దుబ్బ పరమేష్ పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ అందజేత

కొండమల్లేపల్లి : కలెక్టర్ ఆదేశాల మేరకు కొండమల్లేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు దేవరకొండ డీటీసీఎస్‌ఓ హనుమంతు శ్రీనివాస్‌గౌడ్ శుక్రవారం గ్యాస్ సిలిండర్‌ను అందజేశారు. మధ్యాహ్న భోజనాన్ని కట్టెల పొయ్యిపై వంట చేయకుండా ఉండేందుకు ప్రభుత్వం సిలిండర్ మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దవూర డీటీసీఎస్ ముక్తార్, హెచ్‌ఎం నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై ఇంటింటి సర్వే

పెద్దవూర: సీజనల్ వ్యాధులపై మండలంలోని నాయినికుంటతండా, చలకుర్తి, పర్వేదుల, పెద్దవూర, బట్టుగూడెం తదితర గ్రామాల్లో అంగన్‌వాడీ టీచర్లు, ఆశాలు శుక్రవారం ఫీవర్ సర్వే నిర్వహించారు. తీవ్రమైన జ్వరం, కండరాలు, కనుగుడ్లు నొప్పులు, వాంతులు, తదితర లక్షణాలు ఉంటే డెంగీ జ్వరంగా భావించి వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీచర్లు, ఆశలు పాల్గొన్నారు.

ఘనంగా ఏఐఎస్‌ఎఫ్ ఆవిర్భావ వేడుకలు



జెండా ఆవిష్కరిస్తున్న అంజనేయులు

నాగార్జునసాగర్ : ఏఐఎస్‌ఎఫ్ 89వ ఆవిర్భావ వేడుకలు శుక్రవారం నందికొండలోని హిల్ కాలనీలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జెండాను జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు శోభన్‌బాబు,డివిజన్ ఆఫీసర్ బేరర్ శ్రీకాంత్, విజయ్, శివశంకర్, వరప్రసాద్, శివ, సిద్దు, రవి, జయ, మానస, పాల్గొన్నారు.

వసూళ్లకు పాల్పడితే చర్యలు తప్పవు

పెద్దవూర : మండలంలోని పోతునూరు టోల్ ప్లాజా వద్ద వాహనాలను ఆపుతూ వసూళ్లకు పాల్పడుతున్న ట్రాన్స్‌జెండర్స్‌కు ఎస్‌ఐ వీరబాబు శుక్రవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. రోడ్లపై వచ్చిపోయే వాహనాలను ఆపుతూ వాహనదారులను ఇబ్బందులకు గురిచేస్తూ డబ్బులు అడిగితే కేసులు న మోదు చేస్తామని హెచ్చరించారు. మరోసారి ఇలా అక్రమ వసూళ్లకు పాల్పడితే తహసీల్దార్ వద్ద బైండోవర్ చేయనున్నట్లు తెలిపారు. ట్రాంజెండర్లు బలవంతంగా వసూళ్లకు పాల్పడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఎస్‌ఐ తెలిపారు.

తెరచుకోని పల్లె దవాఖాన

- చింతపల్లి మండల కేంద్రంలో మూడు రోజులుగా వైద్య సేవలు బంద్
- ఇబ్బందులు పడుతున్న రోగులు
- నిరంతరం వైద్యసేవలందేలా చూడాలని కోరుతున్న ప్రజలు



మూసి ఉన్న పల్లెదవాఖాన

చింతపల్లి : గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు చేరువ చేసేందుకు ప్రభుత్వం పల్లె దవాఖానలను ఏర్పాటు చేసింది. హెల్త్ సబ్ సెంటర్లను పల్లె దవాఖానాలుగా మార్చి, ప్రతీ దవాఖానాలో ఎంబీబీఎస్ డాక్టర్‌ను నియమించారు. కానీ చింతపల్లి మండల కేంద్రలోని పల్లె దవాఖానాలో వైద్య సిబ్బంది అందుబాటు ఉండడం లేదు. ప్రజలు చికున్ గున్యా, డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి విషజ్వరాలతో ప్రజలు మంచాలకే పరిమితమై నానా అవస్థలు పడుతుంటే వైద్య సేవలందించాల్సిన సిబ్బందికి మాత్రం చీమకుట్టినట్లు కూడా లేదు. వారికి ఇష్టం ఉంటే వస్తారు లేదంటే రారు. రెండు నెలల నుంచి పల్లెల్లో విషజ్వరాలు ప్రబలుతుంటే మండంలోని వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారు. సాధారణంగా సీజనల్ వ్యాధులు వస్తున్నాయంటే పల్లె దవాఖాన వైద్యులు నిత్యం ప్రజలకు వ్యక్తిగత పరిశుభ్రత పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించి, గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాల్సి ఉంటది. కానీ నేడు పల్లె వైద్యుల పరిస్థితి అందుకు భిన్నంగా ఉండటంపై గ్రామస్తులు తీవ్ర అసంతృప్తికి లోనవుతున్నారు. గ్రామస్థాయి వరకు అందరూ ఆరోగ్యంగా ఉండాలని మారుమూల ప్రాంతాలకు ప్రభుత్వ వైద్య సేవలు అందించాలని, ప్రభుత్వాలు కోట్లకు కోట్లు ఖర్చు పెట్టి పల్లె దవాఖనాలను నిర్వహిస్తుంటే క్షేత్రస్థాయిలో వైద్యసిబ్బంది మాత్రం, అందుకు విరుద్ధంగా అంటి ముట్టనట్టు వ్యవహరిస్తున్నారు.

నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం

ప్రభుత్వం పల్లె దవాఖానాలను ఏర్పాటు చేసి అక్కడ ఎంబీబీఎస్ వైద్యుడిని నియమించి ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని నీరుగార్చటమే కాకుండా కనీసం పల్లె దవాఖాన రోగుల్ని పట్టించుకునే పరిస్థితి లేకుండా పోయిందని, పలువురు మండిపడుతున్నారు. గ్రామాల్లోని వైద్యసిబ్బంది పట్టించుకునే పరిస్థితి లేదని, ఇక్కడ ఏమీ వైద్యం లేదని వెళ్తే పీహెచ్‌సీకి వెళ్లండి. .అని ఉచిత సలహాలు ఇస్తున్నారు. పల్లెల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహిస్తూ మందులు పంపిణీ చేయాల్సిన, పల్లె వైద్యులు కనీసం పట్టుమని గంటపాటు ఉండకపోవడం మధ్యాహ్నం లోపే ఆయా గ్రామాల్లో ఉన్న పల్లె దవాఖానాలను మూసివేసి ఇష్టారాజ్యాంగా వెళ్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పల్లె దవాఖానా వైద్యులు, సిబ్బందిపై చర్యలు తీసుకోని మెరుగైన వైద్య సేవలు ప్రజలు అందించాలని కోరుతున్నారు.

వైద్య సిబ్బంది ఉంటలేరు



మండల కేంద్రంలోని పల్లె దవాఖానాలో మూడు రోజుల నుంచి వైద్యసిబ్బంది అందుబాటులో లేరు. కనీసం ఆస్పత్రిని కూడా తెరవడం లేదు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు కావడంతో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి.

- నల్ల శంకర్, చింతపల్లి

ఏఎన్‌ఎం సెలవులో ఉంది



మండల కేంద్రంలోని పల్లె దవాఖానాలో ఉండాల్సిన ఏఎన్‌ఎం మూడు రోజుల నుంచి సెలవుల్లో ఉంది. అన్ని పల్లెదవాఖానాల్లో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి. గ్రామాల్లో ప్రస్తుతం ఫీవర్ సర్వే కొనసాగుతుంది. పల్లె దవావఖానాల్లో అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచాం.

- శ్రీదేవి, వైద్యాధికారి, చింతపల్లి

అధికారులు అప్రమత్తంగా ఉండాలి



దేవరకొండ : సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్



చింతపల్లి : క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ : వర్షాకాల నేపథ్యంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. శుక్రవారం దేవరకొండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పీఏపల్లి మండల ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. సీజనల్ వ్యాధులు రాకుండా గ్రామస్థాయి నుంచే చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో శానిటేషన్ సిబ్బంది అందుబాటులో ఉంటూ మురుగునీరు రోడ్లపైకి రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టాలని ఆయన సూచించారు. ఎప్పటికప్పుడు మండల స్థాయి అధికారులు కార్యదర్శులతో సమావేశాలు నిర్వహించి గ్రామాల పురోగతిపై దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

చింతపల్లి : మండలంలోని కుర్మపల్లి పాఠశాలలో 68వ చింతపల్లి మండల స్థాయి క్రీడా పోటీలను శుక్రవారం దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలతో స్నేహభావం ఏర్పడుతుందన్నారు. క్రీడలు దేహధారుఢ్యానికి దోహదం చేస్తాయన్నారు. ప్రతి క్రీడాకారుడు క్రీడా స్ఫూర్తితో ఆడి, గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. ఈ సందర్భంగా కొద్దిసేపు క్రీడాకారులతో కలిసి క్రికెట్ ఆడి వారిని ఉత్తేజపరిచారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ గురువారావు, అంగిరేకుల నాగభూషణం,ఎరుకలి వెంకటయ్య, యాదగిరి,బొడ్డు శ్రీనివాస్ ,ఎగిరిశెట్టి అనిత, ఈరేటి మల్లేష్ , నరసింహారెడ్డి అనుబంధ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

శిథిలమైన గదుల్లో విద్యార్థులను కూర్చోబెట్టొద్దు



పాఠశాలను పరిశీలిస్తున్న అధికారులు

మిర్యాలగూడ టౌన్ : మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో శిథిలావస్థలో ఉండటంతో పాటు పైకప్పు బలహీనంగా ఉన్న తరగతి గదుల్లో విద్యార్థులను కూర్చోబెట్టొద్దని ఎంపీడీఓ శేష గిరిశర్మ, ఎంఈఓ బాలాజీనాయక్‌లు హెచ్‌ఎంలకు సూచించారు. శుక్రవారం మండలంలోని తడకమళ్ల ప్రాథమిక పాఠశాల తరగతి గదులు శిథిలావస్థలోకి చేరడంతో కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం వారు సందర్శించారు. అనంతరం శిథిలావస్థలోకి చేరిన గదుల్లోని పిల్లలను ఖాళీ చేయించి నిర్మాణంలో ఉన్న తరగతి గదుల్లో కూర్చొబెట్టారు. అదే విధంగా పాఠశాల ఆవరణలో వర్షపు నీరు నిల్వ ఉన్నందున గ్రామ పంచాయతీ సిబ్బందితో తొలగించేందుకు చర్యలు తీసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల కారణంగా బలహీనంగా ఉన్న ప్రహరీ విద్యుత్ స్తంభాల వద్దకు విద్యార్థులు వెళ్లకుండా తగు జాగ్రత్తలను తీసుకోవాలన్నారు.

యువత.. జీవితాలను ఆగం చేసుకోవద్దు



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎస్పీ కె.రాజశేఖర రాజు

మిర్యాలగూడ అర్బన్ : యువత మాదకద్రవ్యాలకు అలవాటు పడి నిండు జీవితాన్ని నాశనం చేసుకోవద్దని, జీవితంలో లక్ష్య సాధనకోసం పాటుపడాలని మిర్యాలగూడ డీఎస్పీ కె.రాజశేఖర రాజు అన్నారు. శుక్రవారం మిషన్ పరివర్తన్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని కేఎన్‌ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పభాఆలను వివరించడంతో పాటు సైబర్‌నేరాలు , డయల్ 1930, వంద, షీటం ప్రాముఖ్యతలను వివరించారు. ఈ కార్యక్రమంలో టూటౌన్ సిఐ నాగార్జున, వన్‌టౌన్ ఎస్‌ఐ లు సుధీర్‌కుమార్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి నిర్మూలన అందరి బాధ్యత

త్రిపురారం : గంజాయి నిర్మూలన అందరి బాధ్యత కావాలని త్రిపురారం తహసీల్దార్ గాజుల ప్రమీలా, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ విజయకుమారి అన్నారు. శుక్రవారం త్రిపురారం మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మండల కేంద్రంలో గంజాయి నిర్మూలిద్దాం అని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, మహిళలు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యువత గంజాయి మత్తుకు అలవాటు పడి వారి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. తల్లిదండ్రులు వారి పిల్లలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో త్రిపురారం ఏపీఎం అశోక్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.

అర్హులైన రైతులందరికీ రుణ మాఫీ

చింతపల్లి : గ్రామాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికి రుణమాఫీ జరుగుతుందని దేవరకొండ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీలక్ష్మి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార కేంద్రాన్ని సందర్శించి రైతుల రుణమాఫీ, రెన్యువల్స్ గురించి వివరాలు తెలుసుకున్నారు. రైతులను ఉద్దేశించి రూ.2 లక్షల రుణాలు దాటిన రైతులదరికీ రుణమాఫీ జరుగుతుందని దానికి సంబంధించిన నిబంధనలు ప్రభుత్వం నుంచి త్వరలో వస్తాయని తెలిపారు. రైతులకు రుణమాఫీకి సంబంధించిన ఏమైనా సందేహాలు ఉంటే మండల వ్యవసాయ అధికారికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. చింతపల్లి రైతు వేదికను సందర్శించారు. మండలంలో రైతులకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. వారి వెంట ఏఓ శ్రావణ్‌కుమార్ ఉన్నారు.



బ్యాంక్ మేనేజర్‌తో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారులు

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలి



ఫొటో ఎగ్జిబిషన్ లో పాల్గొన్న ఉపాధ్యాయులు

మిర్యాలగూడ : విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి చంద్రయాన్ స్ఫూర్తిని కొనసాగించాలని ఉపాధ్యాయులు అన్నారు. మిర్యాలగూడ పట్టణంలోని బకల్‌వాడీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ శాస్త్రీయ పరిశోధనలకు ప్రభుత్వం అత్యధిక నిధులు కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తలకోన శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్, శ్రీనివాస్‌రావు, నాగరాజు, యాదగిరిరెడ్డి, శ్రీనివాస్, మాధవి, పద్మావతి పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి : జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా కొండమల్లేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పలు సైన్స్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంతరిక్ష భారత దేశం సాధించిన ప్రగతిని తెలియజేస్తూ ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను హెచ్‌ఎం నాగేశ్వర్‌రావు ప్రారంభించి మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి



దామరచర్లలో మాట్లాడుతున్న వీరన్ననాయక్

మిర్యాలగూడ : విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేసి పాఠశాలకు తాళం వేసి వెళ్లిపోయిన మండల కేంద్రంలోని హైదరాబాద్ ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి వీరన్న నాయక్ అన్నారు. శుక్రవారం దామరచర్ల మండల కేంద్రంలోని ఆ స్కూల్ వద్ద నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. గత విద్యా సంవత్సరంలో మండల కేంద్రంలో హైదరాబాద్ ఇం టర్నేషనల్ స్కూల్‌ను ఏర్పాటు చేయగా అడ్మిషనుల నిర్వహించాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి సుమారు రూ.5లక్షల వరకు వసూలు చేసి స్కూల్ యాజమాన్యం ఎలాంటి సమాచారం అందించకుండా పాఠశాలకు తాళం వేసి పారిపోయారన్నారు. దీంతో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో వాడపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేసే ఇలాంటి పాఠశాలలు ఇంకా ఉన్నాయని, వాటిపై వెంటనే విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, గణేష్, కుమార్, సాంబ, మేఘ్యా నాయక్, పద్మ, అనిత, శిరీష, ఉమా, విష్ణు, హేమా, రాహుల్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి సాధించవచ్చు



కేవీకేలో టైలరింగ్‌పై మహిళలకు అవగాహన కల్పిస్తున్న ట్రైనర్

త్రిపురారం : మహిళలు తమ నైపుణ్యాన్ని పెంచుకొని, స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని కేవీకే కంపాసాగర్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ శ్రీనివాస్‌రావు అన్నారు. శుక్రవారం కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) కంపాసాగర్‌లో ఎస్సీ ఉప ప్రణాళిక 2024–25లో భాగంగా జిల్లాలోని మహిళలకు టైలరింగ్(కుట్టు మిషన్)పై ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టైలరింగ్ శిక్షకులు ప్రాథమిక కుట్టు సమాచారం, వివిధరకాల డ్రెస్‌లు, డిజైనింగ్, కటింగ్‌లపై అవగాహన కల్పించారు. ఎప్పటికప్పుడు వస్తున్న మార్పులకు అనుగుణంగా స్కిల్స్‌ను పెంచుకోవాలన్నారు. టైలరింగ్‌లో సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం కృషి విజ్ఞాన కేంద్రం కంపాసాగర్ ఆధ్వర్యంలో దత్తత గ్రామాల్లోని 10 మంది ఎస్సీ మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సేద్యపు విభాగం శాస్త్రవేత్త డాక్టర్ చంద్ర శేఖర్, సస్యరక్షణ శాస్త్రవేత్త రాములమ్మ, విస్తరణ శాస్త్రవేత్త పల్లవి సిబ్బంది మహిళలు పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై బీఎల్‌ఓలకు శిక్షణ



మిర్యాలగూడ : అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్



డిండి : మాట్లాడుతున్న తహసీల్దార్ అంజనేయులు

మిర్యాలగూడ : అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేయాలని తహసీల్దార్ హరిబాబు అన్నారు. శుక్రవారం స్థానిక కేఎన్‌ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎల్‌ఓలకు, సూపర్‌వైజర్లకు ఓటర్ల నమోదు, సవరణలు, బీఎల్‌ఓ యాప్ వంటి వాటిపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయాలన్నారు. ప్రతి బీఎల్‌ఓ అన్ని విషయాలపై సమగ్రమైన అవగాహన కలిగి ఉండి ఫామ్ –6,7లకు సంబంధించిన ఓటర్ల నమోదుపై అవగాహన ఏర్పరచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీటీ కల్పన, మాస్టర్ ట్రైనర్ గుడిపాటి కోటయ్య, పోలెబోయిన జనార్దన్, అంబటి శ్రీను, చింతకాయల రామచంద్రుల, సిబ్బంది సత్యనారాయణ, రామకృష్ణ, బాషా, ఫణి, సూపర్‌వైజర్లు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

డిండి: ఓటరు జాబితా తయారిపై మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు శుక్రవారం బీఎల్‌ఓలకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా తహసీల్దార్ అంజనేయులు మాట్లాడుతూ ప్రతి ఇంటికి తిరుగుతూ ఓటరు జాబితాలోని పేర్లను పరిశీలించి తప్పు ఒప్పులను సరి చేయాలని సూచించారు. బీఎల్‌ఓ యాప్‌లో నూతన ఓటర్ల నమోదు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ ముస్తఫ్పా, ఆర్ఐ.శ్యామ్‌నాయక్, ఎఎల్‌ఎంటీ(అసెంబ్లీ లెవల్ మాస్టర్ ట్రైనర్స్)లు శేఖర్, ఇద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

అంతర్గత ఫిర్యాదుల కమిటీ అధ్యక్షురాలిగా జ్ఞానేశ్వరి



మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ మున్సిపాలిటీ అంతర్గత ఫిర్యాదుల కమిటీ అధ్యక్షురాలిగా ఆర్‌ఓ జి. జ్ఞానేశ్వరిని నియమించినట్లు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ ఎండీ యూసుఫ్ తెలిపారు. పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు అంతర్గత కమిటీలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర మున్సిపల్ పరిపాలన కమిషన్ అండ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు నియమించినట్లు పేర్కొన్నారు. అనంతరం వారికి నియమక పత్రాలను కమిటీ సభ్యులకు కమిషనర్ అందజేశారు. అధ్యక్షురాలుగా ఆర్‌ఓ జ్ఞానేశ్వరీతో పాటు సామాజిక కార్యక్రమాల్లో అనుభవం కలిగిన ఇద్దరు వార్డు ఆఫీసర్లు వై.రాధ, పి. సరిత, మహిళల కోసం పని చేసే ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు పందిర్ల పద్మావతిలను కమిటీలో నియమించినట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన కమిటీ పని ప్రదేశాల్లో మహిళా ఉద్యోగులపై లైంగిక, ఇతర వేధింపులు పాల్పడివారిపై ఫిర్యాదులు నమోదు చేసే యాక్టు 2013 ప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

జీఓ నంబర్ 28ని రద్దుచేయాలి



త్రిపురారం : నల్లబ్యాడ్జీ ధరించి నిరసన తెలుపుతున్న వైద్యసిబ్బంది

మిర్యాలగూడ టౌన్ : జీఓ నంబర్ 28 ని రద్దు చేయాలని కోరుతూ ప్రభుత్వ పాఠశాలలు, ఇరిగేషన్ కార్యాలయాల వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి ఉపాధ్యాయులు, ఉద్యోగులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు మాట్లాడుతూ సీపీఎ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు తదితరులున్నారు.

త్రిపురారం : జీఓ 28ని వెంటనే రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని తక్షణమే అమలు చేయాలని మండల వైద్యాధికారి డాక్టర్ శంకర్ నాయక్, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు సత్యనారాయణ, బంజారా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మాలోతు దశరథ నాయక్‌లు డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఎస్, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల పిలుపు మేరకు త్రిపురారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో, చెన్నాయిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జీఓ 28కాపీలు దహనం చేస్తూ నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో పుట్ట గోపాల్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు ఉమ్మడి సైదిరెడ్డి, ఉపాధ్యాయులు సైదయ్య, శ్రీనివాస్, లక్ష్మీ, ఝాన్సీ, నరేందర్, విజయ లక్ష్మీ, బాలు, శ్రీను, తిరుపతమ్మ, పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన

పెద్దవూర : సీపీఎస్‌కు వ్యతిరేకంగా టీఎస్‌సీపీఎస్‌ఈయూ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు మండల కేంద్రంలోని ఎంపీడీఓ, జెడ్పీహెచ్‌ఎస్‌లలో ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆ సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు దొంతిరెడ్డి పంకజ్‌రెడ్డి మాట్లాడారు. అనంతరం సీపీఎస్‌కు సంబంధించిన జీఓ28ని ప్రతులను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పి.మురళి, సూపరింటెండెంట్ హాఫీజ్, ఉపాధ్యాయులు సతీష్, అనిల్‌కుమార్, అరవింద్ రెడ్డి, రాము, రమాదేవి, శ్రీనివాస్, హైమావతి, కళమ్మ, చంద్రమణి, కార్యదర్శులు నాగిరెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, రజిత పాల్గొన్నారు.

నోడల్ అధికారిగా రామలింగేశ్వరరావు



దరఖాస్తులు స్వీకరిస్తున్న రామలింగేశ్వరరావు

డిండి : మండల ఏఓగా విధులు నిర్వహిస్తున్న నాగేశ్వరరావు సూర్యాపేట జిల్లాకు బదిలీ కావడంతో జిల్లా ఉన్నతాధికారులు స్థానిక ప్రభుత్వ విత్తనోత్పత్తి కేంద్రం ఏఓగా విధులు నిర్వహిస్తున్న కె.రామలింగేశ్వరరావును రైతు రుణమాఫీ గ్రీవెన్స్‌కు నోడల్ అధికారిగా నియమించారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతులతో ఆయన మట్లాడారు. ఇటీవల జరిగిన బదిలీల కారణంగా మండలంలోని సంబంధిత వ్యవసాయాధికారులు మూడు రోజుల నుంచి మండల కేంద్రంలో అందుబాటులో లేకపోయారని, ఇక నుంచి రైతు రుణమాఫీపై ఎలాంటి సందేహాలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ జరుగుతుందని రైతులు ఆందోళనకు గురి కావొద్దన్నారు. ఆయన వెంట ఏఈవోలు విజయ, జ్యోతి, రైతులు తదితరులున్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్ విడుదల చేయాలి

దేవరకొండ : రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ నాయకుడు యలమల గోపిచంద్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు కావస్తున్నా ఇంతవరకు విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం ప్రభుత్వానికి విద్యారంగంపై ఉన్న చిత్తశుద్ధి ఏమిటో అర్థమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అమితేష్, శివశంకర్, సంతోష్, శంకర్, ప్రేమ్‌కుమార్, భాను ప్రసాద్, తదితరులున్నారు.

ఘనంగా అంకాలమ్మ, కాటమయ్య జాతర



జాతరలో పెద్ద ఎత్తున పాల్గొన్న ప్రజలు

చందంపేట : మండలంలోని చిత్రియాలలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న అంకాలమ్మ జాతర, కాటమయ్య ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు వైభవంగా సాగాయి. గురువారం కాటమయ్యకు బోనాలు సమర్పించగా శుక్రవారం అంకాలమ్మ జాతరలో చివరి రోజు సందర్భంగా గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.